సాక్షి
కామారెడ్డి

సోమవారం । 13 । మే । 2024



గాలివాన బీభత్సం

జిల్లాలోని పలు ప్రాంతాలలో ఆదివారం గాలివాన బీభత్సం సృష్టించింది. కొనుగోలు కేంద్రాలలో వడ్లు తడిసిపోయాయి.

- 4లో ▸



శాంతియుతంగా నిర్వహించాలి

పార్లమెంట్ ఎన్నికలు శాంతియుతంగా జరిగేలా చూడాలని పోలీసు సిబ్బందికి ట్రెయినీ ఐపీఎస్ కాజల్ సూచించారు.

- 2లో ▸

గరిష్టం/కనిష్టం
41.6 /23.6

వాతావరణం

ఉదయం ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. మధ్యాహ్నం ఉక్కపోతగా ఉంటుంది. అక్కడక్కడ వర్షం కురిసే అవకాశాలున్నాయి. రాత్రి నిర్మలంగా ఉంటుంది.

ఓటుకు వేళాయె!

సార్వత్రిక సమరంలో ఓటుకు వేళయ్యింది. సోమవారం ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభమై సాయంత్రం 6 గంటలకు ముగియనుంది. ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. పోలింగ్ సిబ్బంది ఎన్నికల సామగ్రితో కేంద్రాలకు చేరుకున్నారు.

ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

- పోలింగ్ కేంద్రాలకు చేరిన సిబ్బంది, సామగ్రి
- నేడు ఉదయం 7 గంటలకు ఓటింగ్ షురూ
- సాయంత్రం 6 గంటల దాకా అవకాశం



కామారెడ్డి నుంచి పోలింగ్ కేంద్రాలకు వెళ్తూ..



కామారెడ్డి డిస్ట్రిబ్యూషన్ కేంద్రం వద్ద పోలింగ్ సిబ్బంది

సాక్షి, కామారెడ్డి : జిల్లాలో 6,80,921 మంది ఓటర్లు ఉండగా.. వారికోసం 913 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. 4,460 మంది పోలింగ్ సిబ్బంది ఎన్నికల విధులలో పాల్గొంటున్నారు. అలాగే 1,600 మంది పోలీసు సిబ్బంది భద్రత విధుల్లో ఉన్నారు. నాలుగు కంపెనీల పోలీస్ బలగాలను వివిధ ప్రాంతాల్లో మోహరించారు. ఎన్నికల నిర్వహణకోసం పోలింగ్ సిబ్బంది, సామగ్రిని ఆదివారం ఆయా పోలింగ్ కేంద్రాలకు పంపించారు. కామారెడ్డి నియోజకవర్గానికి సంబంధించి కామారెడ్డి పట్టణంలోని పంపిణీ కేంద్రం నుంచి, ఎల్లారెడ్డి నియోజక వర్గానికి సంబంధించి ఎల్లారెడ్డిలోని పంపిణీ కేంద్రం నుంచి, బాన్సువాడ నియోజకవర్గానికి సంబంధించి బాన్సువాడలోని పంపిణీ కేంద్రం నుంచి, జుక్కల్ నియోజకవర్గానికి సంబంధించి మద్నూర్‌లోని పంపిణీ కేంద్రం నుంచి సిబ్బందిని, సామగ్రిని ఆయా పోలింగ్ కేంద్రాలకు తరలించారు. 1,977 బ్యాలెట్ యూనిట్లు, 987 కంట్రోల్ యూనిట్లు, 1,107 వీవీ ప్యాట్‌లు, అలాగే ఇతర సామగ్రిని 94 రూట్‌ల ద్వారా ఆయా పోలింగ్ కేంద్రాలకు తరలించినట్టు కలెక్టర్ జితేష్ వి పాటిల్ తెలిపారు.

ప్రత్యేక పోలింగ్ కేంద్రాలు

జిల్లాలో ఒక్కో నియోజకవర్గంలో మోడల్ పోలింగ్ కేంద్రంతోపాటు మహిళ, యూత్, దివ్యాంగులకోసం ప్రత్యేక పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. జిల్లాలోని బిజ్జల్‌వాడి, బిచ్కుంద, మేనూర్, పిట్లం, బుర్గుల్, నాగిరెడ్డిపేట, కల్యాణి, లింగారెడ్డిపేట, ఎల్లారెడ్డి, గండిమాసానిపేట, అక్కాపూర్, దోమకొండ, బీబీపేట, భిక్కనూరు, కామారెడ్డి జెడ్పీ కార్యాలయాల్లో మహిళా పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. దివ్యాంగుల కోసం జగన్నాథ్‌పల్లి, పోతాయిపల్లి, కామారెడ్డిలోని ఆర్‌అండ్‌బీ కార్యాలయంలో, యువత కోసం మద్నూర్, మాచాపూర్, అడ్లూర్‌లలో ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేశారు. అవల్గావ్, లింబూర్, జుక్కల్, పుల్కల్, పెద్దకొడప్‌గల్, ధర్మారం, మాగి, రామారెడ్డి, బసన్నపల్లి, సర్వాపూర్, తాడ్వాయి, సదాశివనగర్ రైతువేదికలు, గోపాల్‌పేట, ఎల్లారెడ్డి మున్సిపాలిటీ, లింగంపేట, అన్నారం, మాచారెడ్డి, పల్వంచ, దోమకొండ, బీబీపేట, అంతంపల్లి, శివాయిపల్లి, దేవునిపల్లి గ్రామాలలో మోడల్ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు.

ఇప్పటికే కేంద్రాలకు వెళ్లలేని పరిస్థితుల్లో ఉన్న 85 ఏళ్లు దాటిన వృద్ధులతోపాటు దివ్యాంగులు, ఇతర ఆరోగ్య సమస్యలు ఉన్న వారికి ఇంటి వద్ద నుంచే ఓటు వేసే అవకాశం కల్పించారు. ఈనెల 3 నుంచి 10 వరకు నిర్వహించిన హోం ఓటింగ్‌లో 419 మంది సీనియర్ సిటిజన్లు, దివ్యాంగులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. అలాగే ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులు 4,060 మంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేశారు.

గంటన్నర ముందే మాక్ పోలింగ్

పోలింగ్ ఉదయం 7 గంటలకు ప్రారంభమవుతుంది. అంతకన్నా గంటన్నర ముందు అంటే 5.30 గంటలకు ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో మాక్ పోలింగ్ నిర్వహించనున్నారు. ఇప్పటికే పలు దఫాలుగా సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. మాక్ పోలింగ్ నిర్వహించి, ఎలాంటి పొరపాట్లు లేవని నిర్ధారించుకున్న తరువాత 7 గంటలకు పోలింగ్ ప్రారంభించనున్నారు.

అకాల వర్షాలతో ఇబ్బందులు..

పోలింగ్‌కు ముందు రోజు(శనివారం) నుంచి జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. ఎల్లారెడ్డి డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో గాలిదుమారంతో టెంట్లు పడిపోయాయి. ఆదివారం కూడా వర్షం కురిసే అవకాశాలున్నాయని వాతావరణ శాఖ సూచించింది. దీంతో వర్షం ప్రభావం పోలింగ్‌పై ఏమేరకు ఉంటుందన్న దానిపై చర్చ నడుస్తోంది. భారీ వర్షం కురిస్తే ఓటర్లు కేంద్రాలకు వెళ్లడానికి పెద్దగా ఆసక్తి చూపకపోవచ్చని భావిస్తున్నారు. దీంతో పోలింగ్ శాతం తగ్గుతుందేమోనని అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు.

జిల్లాలో ఓటర్ల వివరాలు..

మొత్తం ఓటర్లు	6,80,921
పురుషులు	3,28,879
మహిళలు	3,52,012
ట్రాన్స్‌జెండర్లు	30
యువ ఓటర్లు	20,962
సీనియర్ సిటిజన్లు	16,503

913	183
పోలింగ్ కేంద్రాలు	సమస్యాత్మకమైనవి

516 పోలింగ్ కేంద్రాలలో వెబ్ కాస్టింగ్



కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన వెబ్ కాస్టింగ్ కేంద్రం

కామారెడ్డి క్రైం: జిల్లాలో 516 పోలింగ్ కేంద్రాలలో వెబ్ కాస్టింగ్‌కు ఏర్పాట్లు చేశామని కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన వెబ్ కాస్టింగ్ ద్వారా నియోజకవర్గాల వారీగా పోలింగ్ సరళిని పరిశీలిస్తామని పేర్కొన్నారు. జిల్లాలో 64 సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి 64 మంది మైక్రో అబ్జర్వర్లను నియమించామని తెలిపారు. శాంతియుత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని పేర్కొన్నారు. పోలింగ్ అనంతరం చెక్‌లిస్ట్ ప్రకారం ఈవీఎంలు, ఇతర మెటీరియల్స్‌ను రిసెప్షన్ కేంద్రాలలో అప్పగించాలని సిబ్బందికి సూచించారు. ప్రతి ఒక్కరు బాధ్యతగా ఓటు వేయాలని ఓటర్లను కోరారు. పోలింగ్ కేంద్రాలలోనికి మొబైల్ ఫోన్‌లకు అనుమతి లేదని తెలిపారు.

బరిలో 19 మంది..

జహీరాబాద్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి మొత్తం 19 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. ప్రధానంగా కాంగ్రెస్ అభ్యర్థి సురేశ్ షెట్కార్, బీజేపీ అభ్యర్థి బీబీ పాటిల్, బీఆర్ఎస్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్‌ల మధ్య పోటీ నెలకొంది. మూడు ప్రధాన పార్టీలు ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుని హోరాహోరీగా ప్రచారం నిర్వహించాయి. దాదాపు నెల రోజులుగా సభలు, సమావేశాలు, రోడ్‌షోలు, కార్నర్ మీటింగులు, ఇంటింటి ప్రచారాలతో హోరెత్తించాయి. మండుటెండలను సైతం లెక్కచేయకుండా ఆయా పార్టీల నాయకులు ప్రచారంలో పాల్గొన్నారు. బరిలో నిలిచిన అభ్యర్థుల భవితవ్యం ఈవీఎంలలో నిక్షిప్తం కానుంది.

న్యూస్‌రీల్

‘రైతులు ఆందోళన చెందవద్దు’



భిక్కనూరు: రైతులు ఆందోళన చెందవద్దని, కొనుగోళ్లను వేగవంతం చేసి ధాన్యాన్ని రైస్ మిల్లులకు తరలిస్తామని అదనపు కలెక్టర్ చంద్రమోహన్ పేర్కొన్నారు. ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల నుంచి తరలించడం లేదని, దీంతో రైతులు ఇబ్బంది పడుతున్నారని తిప్పాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ కిసాన్ విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు కుంట లింగారెడ్డి ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీకి ఫిర్యాదు చేశారు. దీంతో ఆయన ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. కలెక్టర్ ఆదేశాలతో అదనపు కలెక్టర్ చంద్రమోహన్ ఆదివారం తిప్పాపూర్‌లోని కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ధాన్యాన్ని తరలించేందుకు ఆరు లారీలను ఏర్పాటు చేశామన్నారు. మంగళవారం నుంచి వేగంగా వడ్లను తరలించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ కిష్టయ్య, సింగిల్‌విండో చైర్మన్ ఏనుగు వెంకట్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం మండల కన్వీనర్ ద్యావర సాయిరెడ్డి, తాటిపల్లి సిద్దరాములు, నేతలు దుర్గారెడ్డి, తాటిపల్లి రాజయ్య, రత్నం, నర్సారెడ్డి, మధుసూదన్‌రెడ్డి ఉన్నారు.

ధాన్యం నిల్వలు కనిపించొద్దు

మాచారెడ్డి : కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నిల్వలు కనబడొద్దని డీఎస్‌వో మల్లికార్జున్ బాబు అన్నారు. ఆదివారం లచ్చాపేట శివారులోని రైస్‌మిల్లును సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రోజు పది లారీల ధాన్యాన్ని అన్ లోడ్ చేసుకోవాలని రైస్ మిల్లర్లను ఆదేశించారు. వాతావరణంలో మార్పులొస్తున్నాయన్నారు. సివిల్ సప్లైయ్ కార్పొరేషన్ ఇన్‌చార్జి డీఎం నిత్యానందం ఉన్నారు.



సీఎంసీ ఆవరణలో ఎన్నికల సామగ్రిని సరిచూసుకుంటున్న సిబ్బంది



ఎన్నికల సామగ్రితో పోలింగ్ కేంద్రాలకు బయల్దేరుతున్న సిబ్బంది



ఈవీఎంలను సరి చూసుకుంటూ..



డిచ్‌పల్లి నుంచి బయల్దేరేందుకు సిద్ధంగా ఉన్న పోలీసులు



సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఎన్నికల సాధారణ పరిశీలకురాలు ఎలిస్ వజ్ ఆర్, కలెక్టర్ రాజీవ్‌గాంధీ



దొంకేశ్వర్‌లో మహిళా పోలింగ్ కేంద్రం

పర్యవేక్షణ.. పరిశీలన

- ఎన్నికల సిబ్బందికి పోలింగ్ సామగ్రి పంపిణీ
- డ్యూటీ స్థానాలకు చేరుకున్న సిబ్బంది
- నేడు ఉదయం మాక్ పోలింగ్

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): ఎన్నికల విధులు నిర్వర్తించనున్న సిబ్బందికి మండలంలోని సీఎంసీ కళాశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్లలో పోలింగ్ సామగ్రిని ఆదివారం పంపిణీ చేశారు. పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలోని నిజామాబాద్ అర్బన్, నిజామాబాద్ రూరల్ అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి సీఎంసీ కళాశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో ఎన్నికల సామగ్రి పంపిణీ తీరును ఎన్నికల సాధారణ పరిశీలకురాలు ఎలిస్ వజ్ ఆర్, పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ తో కలిసి కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు క్షేత్రస్థాయిలో పరిశీలించి ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈవీఎంల పనితీరును ప్రయోగాత్మకంగా వివరిస్తున్న తీరును గమనించారు. ఎలాంటి లోటుపాట్లు, గందరగోళానికి తావులేకుండా సిబ్బందికి పోలింగ్ సామాగ్రిని పక్కాగా అందించాలని సూచించారు. పోలింగ్ సిబ్బందితో పాటు ఓటింగ్ కేంద్రాల వద్ద బందోబస్తు నిర్వహించే పోలీసు సిబ్బందిని తరలించేందుకు సిద్ధంగా ఉంచిన వాహనాలను పరిశీలించి, సకాలంలో నిర్దేశిత పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది చేరుకునేలా పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. వారి వెంట నగర పాలక సంస్థ కమిషనర్ మకరందు, ఆర్డీవో రాజేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఏర్పాట్లపై సిబ్బంది అసంతృప్తి

సీఎంసీ కళాశాల లో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో తాగునీటి వసతి, అల్పాహారం, భోజన వసతి, షామియానాలు, వైద్య శిబిరం, సిబ్బందిని తరలించేందుకు వాహనాలు, ఇతర వసతులు ఏర్పాటు చేశారు. ముందుగా సెంటర్‌కు చేరుకున్న సిబ్బందికి అధికారులు విధులు కేటాయించారు. రూరల్ నియోజకవర్గ డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో ఏర్పాట్లపై పోలింగ్ సిబ్బంది అసంతృప్తి వ్యక్తం చేశారు. కూలర్లు పని చేయకపోవడంతో ఉక్కపోతతో ఇబ్బందులు పడ్డారు. తాగు నీరు సైతం వేడిగా ఉన్నాయని పలువురు అసహనం వ్యక్తం చేశారు.



క్లుప్తంగా

సాఫ్ట్‌బాల్ జాతీయ పోటీలకు కామారెడ్డి క్రీడాకారులు

కామారెడ్డి అర్బన్ : తెలంగాణ విశ్వవిద్యాలయం పరిధిలో నిర్వహించిన అంతర్ కళాశాలల సాఫ్ట్‌బాల్ పోటీల్లో కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల డిగ్రీ విద్యార్థులు పి రంజిత్‌కుమార్, మహ్మద్ హర్షద్, జి సుమన్ నాయక్, బి బాలాజీలు ప్రతిభ చూపి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ కే.విజయ్‌కుమార్, ఇన్‌చార్జి ఫిజికల్ డైరెక్టర్ శ్రీనివాస్‌రావు తెలిపారు. ఎంపికైన నలుగురు క్రీడాకారులు ఈనెల 15న బెంగుళూరులో నిర్వహించే జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు.

కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు

కామారెడ్డి క్రైం: పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ ప్రక్రియకు సంబంధించి జిల్లా వ్యాప్తంగా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు ఎస్పీ సింధు శర్మ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా 1600 మంది పోలీసులు, అదనపు బలగాలతో భద్రతా చర్యలు చేపట్టామన్నారు. ప్రతి మండలానికి ఒక ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారి ఆధ్వర్యంలో క్విక్ రియాక్షన్, స్ట్రైకింగ్ ఫోర్స్ టీంను, నియోజక వర్గానికి ఒక డీఎస్పీ ఆధ్వర్యంలో స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్‌ను ఏర్పాటు చేశామన్నారు. పోలింగ్ కేంద్రాల్లోకి మొబైల్ ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులు అనుమతి లేదన్నారు. ప్రజలు దీనిని గమనించాలని సూచించారు. ఓటర్లను ప్రలోభ పెట్టే విధంగా ఎవరైనా నగదు, మద్యం మరియు ఇతరత్రా వస్తువులను పంపిణీ చేస్తున్నట్లు తెలిస్తే వెంటనే డయల్ 100 కి ఫోన్ చేసి గానీ, సీ విజిల్ యాప్ ద్వారా గానీ ఫిర్యాదు చేయాలన్నారు. పోలింగ్ కేంద్రానికి 100 మీటర్ల దూరంలో ఎవరూ ఉండరాదన్నారు. ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని కోరారు.

పకడ్బందీగా 144 సెక్షన్ అమలు

పెర్కిట్(ఆర్మూర్): పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్‌ను పకడ్బందీగా అమలు చేయాలని సీపీ కల్మేశ్వర్ అన్నారు. ఆర్మూర్ మండలం అంకాపూర్‌లోని పోలింగ్ కేంద్రాన్ని సీపీ ఆదివారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులతో మాట్లాడి సౌకర్యాల వివరాలను తెలుసుకున్నారు.

తరగు తీస్తే చర్యలు

- జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు

నిజాంసాగర్: కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించిన రైతులను తరుగు పేరిట ఇబ్బందులకు గురి చేస్తే చర్యలు తప్పవని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు హెచ్చరించారు. ఆదివారం జుక్కల్ మండలంలోని ఖండెబల్లూర్ కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన ఆయన రైతుల సమస్యలు తెలుసుకున్నారు. బస్తాకు రెండు కిలోలు అదనంగా తూకం వేస్తున్నారని, లారీలో తరలింపు కోసం బస్తాకు రూ.4 వసూలు చేస్తున్నారని రైతులు ఎమ్మెల్యేకు చెప్పారు. స్పందించిన ఎమ్మెల్యే కొనుగోలు కేంద్రం ఇన్‌చార్జిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ధాన్యం సేకరణ విషయంలో రైతులను ఇబ్బంది పెట్టవద్దని మిల్లర్లు తరుగు తీయవద్దన్నారు.



రైతుల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు

'ధాన్యం తడవకుండా చూడాలి'



కామారెడ్డి క్రైం: అకాల వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడవకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ చంద్రమోహన్ అధికారుల కు సూచించారు. ఆదివారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో జిల్లా సహకార, పౌరసరఫరాల అధికారులు, లారీ ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్‌లు, ఉప తహసీల్దార్‌లతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కొనుగోళ్లను వేగవంతం చేయాలని, తూకం వేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలని సూచించారు. తడిచిన ధాన్యాన్ని వెంటనే బాయిల్డ్ రైస్ మిల్లులకు తరలించాలని డి ప్యూటీ తహసీల్దార్‌లను ఆదేశించారు. సమావేశంలో డీఎస్‌వో మల్లికార్జున్ బాబు, సి విల్ సప్లయ్ కార్పొరేషన్ ఇన్‌చార్జి డీఎం నిత్యానందం తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలు శాంతియుతంగా నిర్వహించాలి



మాట్లాడుతున్న ట్రెయినీ ఐపీఎస్ కాజల్

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి) : పార్లమెంట్ ఎన్నికలను శాంతియుతంగా జరిగేలా చూడాలని పోలీసు సిబ్బందికి ట్రెయినీ ఐపీఎస్ కాజల్ సూచించారు. ఆదివారం ఎల్లారెడ్డి పోలింగ్ డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో విధులకు హాజరవుతున్న సిబ్బందికి పలు సూచనలు చేశారు. పోలింగ్ కేంద్రానికి 100 మీటర్ల లోపు ఎవరు ఫోన్లు, ఇతర సామగ్రిని వెంట తీసుకురాకుండా చూడాలని సూచించారు. ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని 270 పోలింగ్ కేంద్రాలున్నాయని వీటిలో 59 పోలింగ్ కేంద్రాలు క్రిటికల్ పోలింగ్ కేంద్రాలున్నాయని ఆమె తెలిపారు. ఇద్దరు డీఎస్పీలు, ఆరుగురు సీఐలు, ఆరుగురు ఎస్సైలు, 550 మంది పోలీసు సిబ్బందితో పాటు, మధ్యప్రదేశ్‌కు చెందిన వంద మంది వచ్చారన్నారు. కార్యక్రమంలో డీఎస్పీలు శ్రీనివాసులు, మదన్‌లాల్, సీఐలు రవీందర్ నాయక్, సంతోష్, ఎస్సైలు మహేష్, చైతన్యకుమార్ తదితరులున్నారు.



ఆంధ్రకు తరలిన ఓటర్లు

కామారెడ్డిక్రైం: ఆంధ్రలో శాసనసభ, పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో ఉంటున్న ఆంధ్ర ఓటర్లు తరలి వెళ్లారు. బస్సుల్లో రద్దీ నెలకొంది

బ్లడ్ క్యాన్సర్‌తో పోరాటం

- వైద్యానికి రూ.30 లక్షల వరకు ఖర్చు
- మరో రూ.30 లక్షలు కావాలంటున్న వైద్యులు
- ఆపన్నహస్తం కోసం ఎదురుచూపు



ఎల్లారెడ్డి రూరల్: మద్నూర్‌కు చెందిన కాలే శక్తిరాజ్ బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతూ ఆపన్నహస్తం కోసం ఎదురు చూస్తున్నాడు. మద్నూర్ మండల కేంద్రానికి చెందిన శక్తిరాజ్ ఎల్లారెడ్డిలోని మోడల్ స్కూల్‌లో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నాడు. గత ఏడాది జూలైలో అనారోగ్యానికి గురికాగా హైద్రాబాద్‌లోని యశోద ఆస్పత్రిలో చూపెట్టుకున్నాడు. పరీక్షలు చేసిన వైద్యులు బ్లడ్ క్యాన్సర్‌గా గుర్తించారు. ప్రస్తుతం ఆయన యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఇప్పటి వరకు రూ.30 లక్షల వరకు ఖర్చు అయింది. మరో రూ.35 లక్షలు అవసరం అని వైద్యులు తెలిపారు. దాతలు చేయూత అందించాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు. ఆర్థికసాయం అందించి తన భర్తను కాపాడాలని ఆయన భార్య జ్యోత్స్న దాతలను వేడుకుంటోంది.

బాధితుల బ్యాంకు ఖాతా వివరాలు
బ్యాంకు ఖాతా నంబర్ : 62291975675
ఐఎఫ్ఎస్‌సీ కోడ్ ఎస్‌బీఐఎన్ 0020118
గూగుల్‌పే, ఫోన్ పే నంబర్ :
8978793338(శక్తిరాజ్)
9885214076 (జ్యోత్స్న)

15న డీఎంహెచ్‌వోపై విచారణ

- విచారణ అధికారిగా డీపీహెచ్ఎఫ్‌డబ్ల్యూ ఏడీ అమర్‌సింగ్
- వైద్యాధికారులందరూ హాజరు కావాలని ఆదేశాలు

కామారెడ్డి టౌన్: కామారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ లక్ష్మణ్‌సింగ్‌పై ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. డీఎంహెచ్‌వో లైంగిక వేధింపులకు గురి చేస్తున్నారని జిల్లాలోని మెడికల్ ఆఫీసర్లు రాష్ట్ర, జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసిన ఘటన కలకలం రేపింది. ఈ ఘటనపై రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి క్రిస్టినా జడ్ చోంగ్తూ, ప్రభుత్వం సిరీయస్ అయిన విషయం తెలిసిందే. ఆయనపై ఫిర్యాదులు, పత్రికల్లో వచ్చిన వార్తల నేపథ్యంలో ఆదివారం ప్రభుత్వం విచారణకు ఆదేశాలను జారీ చేసింది. డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ ఫ్యామిలి లీవెల్ఫేర్ అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ అమర్‌సింగ్ నాయక్‌ను విచారణ అధికారిగా నియమించింది. ఈ నెల 15వ తేదిన ఉదయం 10 గంటలకు కలెక్టరేట్‌లోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఆయన విచారణ చేయనున్నారు.

జిల్లాలోని ప్రభుత్వ వైద్యులు, మెడికల్ ఆఫీసర్‌లు, ఆరోపణలు ఎదుర్కొంటున్న సిబ్బంది విచారణకు హాజరు కావాలని ఆయన ఆదేశాలను జారీ చేశారు. కాగా విచారణకు మహిళా అధికారిని నియమించాలని వైద్యులు డిమాండ్ చేస్తున్నారు. ఆయనతో పాటు ఒక మహిళా అధికారిని కూడా నియమిస్తే బాగుంటదని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

క్రైం కార్నర్

రోడ్డుప్రమాదంలో మహిళ మృతి



కుమ్మరి సత్తవ్వ (ఫైల్)

రాజంపేట: మండలంలోని ఆర్గొండ గ్రామానికి చెందిన కుమ్మరి సత్తవ్వ (51) శనివారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందింది. కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్తున్న సమయంలో గుర్తుతెలియని టిప్పర్ ఢీకొని సత్తవ్వ అక్కడికక్కడే మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సంపత్ తెలిపారు.

ధాన్యం కుప్పను ఢీకొని ఒకరికి తీవ్రగాయాలు

పిట్లం(జుక్కల్): మండల కేంద్రం శివారులోని జాతీయ రహదారి సర్వీస్ రోడ్డుపై జరిగిన ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన శనివారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని చిన్నరొడప్గల్ గ్రామానికి చెందిన కృపనందు, ప్రేమ్‌కుమార్ కలిసి బైక్‌పై హైదరాబాద్ నుంచి స్వగ్రామానికి వస్తుండగా, రోడ్డుపై ఉన్న ధాన్యం కుప్పను బైక్ ఢీకొట్టింది. ఈ ఘటనలో ప్రేమ్‌కుమార్‌కు తీవ్రగాయాలు కావడంతో చికిత్స నిమిత్తం హైవే అంబులెన్స్‌లో పిట్లం ప్రభుత్వ ఆస్పత్రికి, అక్కడి నుంచి మెరుగైన చికిత్సకోసం బాన్సువాడ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

ట్రాక్టర్ ఢీకొని బాలుడి మృతి



ఘటనా స్థలంలో బాలుడి మృతదేహం



ప్రణీత్(ఫైల్)

కామారెడ్డి క్రైం: మైనర్ డ్రైవింగ్ ప్రమాదకరమని, నేరమని పోలీసులు అవగాహన కల్పిస్తున్నా ప్రజల్లో మార్పు రావడం లేదు. ఓ బాలుడు బైక్ నడుపుతుండగా ఎదురుగా వచ్చిన ట్రాక్టర్ అదుపు తప్పి ఢీకొనడంతో అక్కడికక్కడే మరణించాడు. దేవునిపల్లి ఎస్సై రాజు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కామారెడ్డి మండలం చిన్న మాల్లారెడ్డి గ్రామానికి చెందిన కంతి రాజు వ్యవసాయం చేస్తున్నాడు. అతడి కుమారుడు ప్రణీత్(12), మరో ఇద్దరు కలిసి ఆదివారం బైక్‌పై పొలానికి వెళ్తుండగా.. గుండమ్మ వాగు రోడ్డు సమీపంలో ఎదురుగా వచ్చిన ట్రాక్టర్ ఢీకొంది. ఈ ప్రమాదంలో ప్రణీత్ అక్కడికక్కడే మృతి చెందాడు. అతడి సోదరుడు, మరొకరు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఘటనా స్థలాన్ని దేవునిపల్లి పోలీసులు పరిశీలించి వివరాలు సేకరించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు ట్రాక్టర్ డ్రైవర్‌పై కేసు నమోదు చేశారు.

జోరుగా మద్యం విక్రయాలు

- ఎన్నికల నిబంధనలు గాలికి..
- పట్టించుకోని అధికారులు

ఆర్మూర్‌టౌన్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో రెండు రోజులపాటు మద్యం దుకాణాలను మూసి ఉంచాలన్న నిబంధనలను పట్టించుకున్న వారు కరువయ్యారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఎక్సైజ్ అధికారులు వైన్‌షాపులను సీజ్ చేసినప్పటికీ.. పట్టణంలో జోరుగా మద్యం విక్రయాలు సాగుతున్నాయి. ఒక్కో బీరుసీసాపై రూ.20 నుంచి రూ.30, కల్లు ప్యాకెట్‌పై రూ.20వరకు అదనంగా వసూలు చేస్తూ విక్రయిస్తున్నా సంబంధిత అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదని పట్టణవాసులు అంటున్నారు. ఇదిలా ఉండగా కొందరు అధికారుల కనుసన్నల్లోనే మద్యం అక్రమంగా విక్రయిస్తున్నారని ఆరోపిస్తున్నారు. మరోవైపు పలు రాజకీయపార్టీల నాయకులు ఇతర రాష్ట్రాల మద్యాన్ని ఇంటికి పంపిణీ చేస్తున్నట్లు సమాచారం.



పట్టణంలోని ఓ వైన్‌షాపు పక్కన బ్యాగులో మద్యం సీసాలు

భార్య కాపురానికి రావడం లేదని ట్యాంకు ఎక్కిన యువకుడు

రామారెడ్డి: భార్య కాపురానికి రావడం లేదని మద్యం మత్తులో ఓ యువకుడు వాటర్ ట్యాంక్ ఎక్కాడు. ఈ ఘటన ఆదివారం మండల కేంద్రంలో చోటుచేసుకుంది. ఎస్సై విజయ్ కొంత తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. కట్టా బాబు(35) తన భార్య సంసారానికి రావడం లేదని మనస్తాపంతో మద్యంమత్తులో రతలగైని సమీపంలోని వాటర్ ట్యాంక్ ఎక్కాడు. గమనించిన పోలీస్ కానిస్టేబుల్ రంజిత్ రెడ్డి ట్యాంక్ పైకి ఎక్కి అతడిని, ఫైర్ సిబ్బంది సహాయంతో సురక్షితంగా కిందకు దించాడని ఎస్సై తెలిపారు.



54 కేసులు.. రూ. కోటీ 32లక్షలు సీజ్

- 49 కేసులకు సంబంధించి రూ. కోటీ 12లక్షలు విడుదల

సుభాష్‌నగర్: పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఎస్‌టీటీ, ఎఫ్ఎస్‌టీ, పోలీసులు చేపట్టిన తనిఖీల్లో ఇప్పటివరకు 54 కేసులు నమోదు చేసినట్లు రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. రూ.1,32,20,976 విలువైన నగదు, బంగారం, వెండి వస్తువులు సీజ్ చేశామని పేర్కొన్నారు. జిల్లా గ్రీవెన్స్ కమిటీ పరిశీలన, విచారణ అనంతరం 49 కేసులకు సంబంధించి రూ. 1,12,60,076లను విడుదల చేశామన్నారు. మరో నాలుగు కేసులకు సంబంధించి గ్రీవెన్స్ కమిటీ పరిశీలనలో ఉన్నాయని, ఒక కేసును ఆదాయపు పన్ను శాఖకు సిఫార్సు చేసినట్లు కలెక్టర్ పేర్కొన్నారు.

కొబ్బరి చెట్టుపై పిడుగు



రామారెడ్డి: మండల కేంద్ర గ్రామపంచాయతీ పరిధిలోని రాజమ్మతండాలో ఆదివారం కొబ్బరి చెట్టుపై పిడుగు పడింది. తండాకు చెందిన భూక్యా నారాయణనాయక్ ఇంటి ఎదుట ఉన్న కొబ్బరిచెట్టుపై పిడుగుపడగా.. ఎలాంటి ఆస్తి, ప్రాణ నష్టం జరగలేదు. కొబ్బరి చెట్టుపై భాగం పాక్షికంగా కాలిపోయింది.

గాలివాన బీభత్సం

ఉమ్మడి జిల్లాలో ఆదివారం గాలివాన బీభత్సం సృష్టించింది. అకాల వర్షానికి ధాన్యం తడిసిపోయింది. బలమైన గాలులు వీయడంతో పలు ఇళ్ల పైకప్పు రేకులు ఎగిరిపోయాయి. చెట్లు విరిగి విద్యుత్ తీగలపై పడటంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.


పాల్వంచ మండలం వాడిలో తడిసిన ధాన్యం


కామారెడ్డి జిల్లా కేంద్రంలో వర్షానికి తడిసిన ధాన్యం

ఎల్లారెడ్డిరూరల్/రాజంపేట/లింగంపేట: నాగిరెడ్డిపేట మండలంలోని ఆత్మకూర్‌లో రేకుల షెడ్డు ఎగిరి కింద పడింది. మండలంలోని గోపాల్‌పేట్, తాండూర్ గ్రామాలలో వడగండ్ల వర్షం కురిసింది. రాజంపేట మండలంలో ఆరబెట్టిన వరిధాన్యం తడిసిపోయింది. లింగంపేట మండలంలో సైతం ధాన్యం తడిసిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

మాచారెడ్డి: వర్షానికి మండలంలోని మైసమ్మ చెరువు తండా, పాల్వంచ మండలం వాడి, గజ్యానాయక్ తండా చౌరస్తాలో సైడ్ డ్రెయినేజీ లేక ఇళ్లలోకి నీరు చేరి స్థానికులు ఇబ్బందులు పడ్డారు. మైసమ్మ చెరువు తండాలో గాలికి బుక్యా విజయకు చెందిన ఇంటి పైకప్పు రేకులు ఎగిరిపోయాయి. పాల్వంచ మండలం వాడిలో కొనుగోలు కేంద్రంలోని ధాన్యం తడిసిపోయింది. గజ్యానాయక్ తండా చౌరస్తాలో డ్రైయినేజీలు లేకపోవడంతో వరద నీరు ఇళ్ల లోకి వచ్చి చేరుతుంది.

గాంధారి: మండలంలోని సోమారం తండాలో కేతావత్ గప్పునకు చెందిన ఇంటి పైకప్పు రేకులు ఎగిరిపోయింది. ఇంటి ముందు పాక కూలి పోవడంతో పాకలోని ఎద్దు కాలు విరిగిందని బాధితుడు తెలిపారు. వండ్రికల్ గ్రామంలో ఓ ఇంటి ఆవరణలో ఉన్న కొబ్బరి చెట్టుపై పిడుగు పడింది. దీంతో చెట్టు కాలిపోయింది.

మోపాల్: మండలంలోని మంచిప్ప, ముదక్‌పల్లి శివార్లలో ఈదురుగాలులకు 2 డీపీ ట్రాన్స్‌ఫార్మర్లు, 14 విద్యుత్‌స్తంభాలు కూలిపోయాయి. ముదక్‌పల్లిలోని చిలుకల చిన్నమ్మ ఆలయ సమీపంలో కారుపై చెట్టు విరిగిపడింది. కాగా ఎన్నికల పోలింగ్ కేంద్రాలకు విద్యుత్ సరఫరా పునరుద్ధరించేందుకు విద్యుత్‌శాఖ అధికారులు వెంటనే రంగంలోకి దిగారు. గాలులకు తెగిపడ్డ తీగలు, స్తంభాలను గుర్తించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరిస్తున్నారు.

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలో ఆదివారం కురిసిన వర్షంతో గాంధీ గంజ్‌లో రైతులు ఆరబెట్టిన ధాన్యం తడిసిపోయింది. గాలులకు ధాన్యం కుప్పలపై కప్పిన టార్పాలిన్లు ఎగిరిపోయాయి. వర్షపు నీటి ప్రవాహానికి ధాన్యం కొట్టుకుపోయాయి. దీంతో రైతులు అనేక ఇబ్బందులు పడ్డారు.


గజ్యానాయక్ తండా చౌరస్తాలో వర్షం నీరు


మైసమ్మ చెరువుతండాలో రేకులు ఎగిరిపోయి మిగిలిన గోడలు


సోమారం తండాలో ఎగిరిపోయిన రేకులు


ఆత్మకూర్‌లో ఎగిరిపోయిన రేకులు


మంచిప్పలో కూలిన ట్రాన్స్‌ఫార్మర్


వండ్రికల్‌లో పిడుగు పడి కాలిపోతున్న చెట్టు

మండుటెండలో నిండుకుండలా..


కాలువ నీటిని ఆధారం చేసుకొని ఏర్పాటు చేసిన పంపుసెట్లు

- కాకతీయ కాలువలో నీటి నిల్వ
- హర్షం వ్యక్తంచేస్తున్న రైతులు
- ముందస్తుగా పంటల సాగుకు అనుకూలం

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి నీటిని సరఫరా చేసే కాకతీయ కాలువ మండుటెండల్లోనూ నిండుకుండలా ఉంది. దీంతో ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాకతీయ కాలువలో ఏడాదిపొడుగునా నీరు నిల్వ ఉండటంతో కాలువకు ఇరు వైపులా భూ గర్భజలాలు సమృద్ధిగా ఉంటున్నాయి. కాలువలోని నీటిని ఆధారంగా చేసుకొని రైతులు పంపు సెట్‌లను ఏర్పాటు చేసుకొని నీటిని వినియోగించుకుంటున్నారు. ప్రస్తుతం కూడా కాలువలో నీరు సమృద్ధిగా నిల్వ ఉంచారు. జిల్లాలోని కమ్మర్‌పల్లి మండలం ఉప్లూర్ గ్రామం వద్ద కాకతీయ కాలువ క్రాస్ రెగ్యులేటర్‌ను దించి కాలువలో నీటిని నిల్వ ఉంచుతున్నారు.

50 క్యూసెక్కులకు జీవో

కాకతీయ కాలువ ద్వారా నీటి విడుదల లేని సమయంలో కాలువలో నీటి నిల్వ కోసం ప్రతి రోజూ 50 క్యూసెక్కుల నీటిని నిరంతరం విడుదల చేపట్టాలని ప్రత్యేక జీవోను ప్రభుత్వం ఇచ్చింది. అప్పటి నుంచి కాలువలో నీరు నిల్వ ఉంటోంది. కాకతీయ కాలువ నిర్మాణంలో ఆయా గ్రామాల ఊర చెరువులను కోల్పోయారు. దీంతో నీటిని నిల్వ చేసేందుకు అవకాశం లేకపోవడంతో కాలువలోనే నీటిని నిల్వ చేసేలా ప్రత్యేక జీవోను ఆయకట్టు రైతులు సాధించుకున్నారు. 2017లో లీకేజీ నీటి కోసం ఆయకట్టు రైతులు పెద్ద ఉద్యమమే చేపట్టారు. దీంతో దిగి వచ్చిన ప్రభుత్వం నీటి నిల్వ కోసం అవకాశం కల్పించింది.

ముందస్తు సాగుకు అవకాశం

కాకతీయ కాలువలో నిల్వ ఉండే నీరు ఆధారంగా రైతులు పంపు సెట్లను ఏర్పాటు చేసుకున్నారు. కాలువ నుంచి పంట భూముల వరకు పైపు లైన్ వేసుకున్నారు. కొందరు రైతులైతే ఏకంగా 4 నుంచి5 కిలోమీటర్ల దూరం వరకు కూడా పైపులైన్ వేశారు. కాలువలో నీరు ఎప్పుడూ నిల్వ ఉంటుండడంతో ప్రస్తుత ఖరీఫ్‌లో పంటలను ముందస్తుగా సాగు చేసేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. కాలువ నీరు ఆధారంగా రైతులు పసుపు, మక్క, సోయా, వరి పంటలను సాగు చేస్తున్నారు. ప్రస్తుత ప్రభుత్వం కాలువలో నీటిని నిల్వ ఉంచేందుకు చర్యలు తీసుకోవడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

నీరు అందుతుంది



కాకతీయ కాలువలో ఎండా కాలంలో కూడా నీరు నిల్వ ఉండటంతో పంటలకు ఎల్లప్పుడూ నీరందుతోంది. కాలువ నీరు ఆధారంగా పంపు సెట్ బిగించి పైపు లైన్ వేశాను. ఖరీఫ్‌లో పంటలను ముందుగా సాగు చేసేందుకు సిద్ధమవుతున్నాను. ప్రభుత్వానికి రుణ పడి ఉంటాం. – ఆకుల రాజన్న, రైతు

గల్ఫ్‌ను తాకిన ఎన్నికల వేడి

- కార్మికుల క్యాంపులలో ప్రచారం నిర్వహించిన మూడు పార్టీల నేతలు


దుబాయ్‌లోని లేబర్ క్యాంపులో ప్రచారం చేస్తున్న టీపీసీసీ ఎన్నారై సెల్ నాయకులు(ఫైల్)

మోర్తాడ్: పార్లమెంట్ ఎన్నికల వేడి గల్ఫ్ దేశాలను తాకింది. సోమవారం పోలింగ్ జరగనుండగా ఇక్కడ ప్రచారానికి శనివారం సాయంత్రంతోనే తెరపడింది. గల్ఫ్‌లో ఎన్నికల ప్రచారానికి ఎలాంటి నిబంధనలు అవసరం లేకపోవడంతో ఆదివారం కూడా క్యాంపులలో విస్తృతమైన ప్రచారం కొనసాగించడం విశేషం. గల్ఫ్‌లో ఉన్న మూడు ప్రధాన పార్టీల కార్మిక నాయకులు ప్రతి రోజు కార్మికుల క్యాంపులలో విస్తృతంగా పర్యటిస్తున్న ఎంపీ అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. కార్మికులు వారి కుటుంబ సభ్యులతో తమ పార్టీల అభ్యర్థులకు ఓటు వేయించాలని కోరారు. తెలంగాణలోని వివిధ జిల్లాల్లో జోరుగా సాగుతున్న ప్రచారం మాదిరిగానే గల్ఫ్ దేశాల్లోను ఎన్నికల ప్రచారం జరగడం విశేషం. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్(యూఏఈ)లోని దుబాయి, షార్జా, అబుదాబి ప్రాంతాల్లోని లేబర్ క్యాంపులలో టీపీసీసీ దుబాయ్ కన్వీనర్ ఎస్వీ రెడ్డి ప్రచారం చేశారు. వలస కార్మికులను కలుసుకుని వారి కుటుంబ సభ్యులు కాంగ్రెస్ అభ్యర్థులకు ఓటు వేసేలా సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం గల్ఫ్ బోర్డుకు సుముఖంగా ఉందని ఎంపీలను గెలిపిస్తే మరిన్ని డిమాండ్లను సాధించుకోవచ్చని ఆయన ప్రచారం కొనసాగిస్తున్నారు. అలాగే గల్ఫ్‌లోని బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల నాయకులు, మద్దతుదారులు కూడా వలస కార్మికులను కలుసుకుని తమ పార్టీల అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని కోరారు.

ప్రతి రోజూ ప్రచారం



లేబర్ క్యాంపులలో సాయంత్రం వేళ పర్యటించి రోజు ప్రచారం చేశాం. బీజేపీ అభ్యర్థులకు ఓట్లు వేయాలని ఇంటికి ఫోన్ చేసి చెప్పాలని కార్మికులను కోరాం.

– తోట రమేశ్ పటేల్, బీజేపీ గల్ఫ్ కన్వీనర్, బహ్రెయిన్

సరిహద్దులో పటిష్ట నిఘా


సాలూర చెక్ పోస్టు వద్ద కార్లను తనిఖీ చేస్తున్న సిబ్బంది

బోధన్: పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా డబ్బు, మద్యం అక్రమ రవాణా నియంత్రణకు అధికార యంత్రాంగం మహారాష్ట్ర సరిహద్దుల్లో పోలీస్ చెక్ పోస్టులను ఏర్పాటు చేసి పటిష్ట నిఘా ఏర్పాటు చేసింది. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు బోధన్ రెవెన్యూ డివిజన్ పరిధిలోని సాలూర మండల శివారులోని అంతరాష్ట్ర చెక్ పోస్టు, పొతంగల్ మండల శివారులో, రెంజల్ మండలంలోని కందకుర్తి గ్రామం అంతరాష్ట్ర సరిహద్దుల్లో పోలీస్ చెక్ పోస్టులను ఏర్పాటు చేశారు. ఆదివారం చెక్ పోస్టుల వద్ద పోలీస్ సిబ్బంది మహారాష్ట్ర, తెలంగాణ ప్రాంతాల వైపు నుంచి రవాణా అవుతున్న కార్లు, ఇతర వాహనాలను తనిఖీలు చేపట్టారు. సోమవారం పోలింగ్ జరుగనున్నందున పోలీసులు వాహనాల తనిఖీలను ముమ్మరం చేశారు.

చెరువుకు చేరిన ఊరు




ఈ చిత్రం చూశారా... ఊరే చెరువుకు చేరినట్టు ఉంది. మంచిర్యాల జిల్లా తాండూర్‌లోని చేపల ప్రియులంతా చెరువు బాట పట్టారు. గ్రామ శివారులోని పెద్ద చెరువులో ఆదివారం వేకువజాము నుంచే చేపలు పడుతున్న విషయం తెలుసుకున్న స్థానికులు పెద్ద ఎత్తున అక్కడికి చేరుకున్నారు. ఓటు హక్కు వినియోగించుకునేందుకు దూర ప్రాంతాల నుంచి కుటుంబ సభ్యులు స్వగ్రామాలకు రావడంతో చేపల ప్రియులంతా చెరువు వద్దకు చేరుకుని చేపలు కొనుగోలు చేశారు. పెద్ద సైజు చేపలు తక్కువ రేటుకు దొరకడంతో పోటాపోటీగా కొనుగోలు చేశారు. - తాండూర్

జిల్లా కేంద్రంలోని పీటీజీ పాఠశాల వద్ద వరదలో బైక్


జంగాంలో ఆటోపై విరిగిపడిన విద్యుత్ స్తంభం


మండుటెండల్లో గాలివాన బీభత్సం

ఆసిఫాబాద్/ఆసిఫాబాద్‌రూరల్/కెరమెరి/జైనూర్: కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో ఆదివారం సాయంత్రం ఈదురుగాలులతో కురిసిన వర్షం బీభత్సం సృష్టించింది. జిల్లా కేంద్రంలో దాదాపు రెండు గంటలపాటు వర్షం కురిసింది. స్థానిక పీటీజీ పాఠశాలలో ఎన్నికల సామగ్రి పంపిణీ కోసం ఏర్పాటు చేసిన టెంట్లు కూలిపోయాయి. కుర్చీలు కొట్టుకుపోయాయి. పలు కాలనీల్లో చెట్లు విరిగి పడ్డాయి. సందీప్‌నగర్‌లో మూడు స్తంభాలు విరిగి పడటంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. ఆసిఫాబాద్ మండలంలోని మోతుగూడ, బూర్గుడ, అప్పపల్లి, ఈదులవాడ గ్రామాల్లో మధ్యాహ్నం నుంచి విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. గుండి వాగుపై ఏర్పాటు చేసిన తాత్కాలిక వంతెన తెగి రాకపోకలు నిలిచిపోయాయి. జైనూర్ మండలం జంగాంలో విద్యుత్ స్తంభం విరిగి గ్రామానికి చెందిన సయ్యద్ సల్మాన్ ఆటోపై పడింది. ఆటో ముందు భాగం ధ్వంసమైంది. కెరమెరి మండలంలోని ఝరి, మోడి సాంగ్వి, గోయగాం, అనార్‌పల్లి, కెలి కె, రింగన్‌ఘాట్, జోడేఘాట్ ఇందాపూర్, నిషాని గ్రామాల్లో వర్షం కురిసింది. సాంగ్వి కల్వర్టు పైనుంచి వరద పారింది.


తెగిన గుండి వాగు తాత్కాలిక వంతెన


సాంగ్వి కల్వర్టు పైనుంచి ప్రవహిస్తున్న వరద నీరు


జిల్లా కేంద్రంలో డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో కూలిన టెంట్లు

ఎన్నికల విధుల్లో.. ఎస్సై సోదరులు


మావల, జైనథ్ ఎస్సైలు విష్ణువర్ధన్, పురుషోత్తం

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రం వద్ద అన్నాదమ్ముళ్లు ఇద్దరు ఎస్సైలు ఆదివారం ఒకే చోట విధులు నిర్వర్తించారు. వీరిది మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం నర్సాపూర్ గ్రామం. 2018 బ్యాచ్‌కు చెందిన వంగ విష్ణువర్ధన్ మావల ఎస్సైగా పనిచేస్తున్నారు. 2020 బ్యాచ్‌కు చెందిన ఆయన సోదరుడు పురుషోత్తం జైనథ్ ఎస్సైగా విధులు నిర్వహిస్తున్నారు. బందోబస్తు విధులకు సోదరులు హాజరు కావడంతో తోటి ఉద్యోగులు, సిబ్బంది ఆసక్తిగా గమనించారు. విష్ణువర్ధన్ గత రెండున్నరేళ్లుగా జిల్లాలో పనిచేస్తుండగా, ఆయన సోదరుడు ఏడాది నుంచి జైనథ్ ఎస్సైగా పనిచేస్తున్నారు.

కాలికి గాయమైనా.. పంపిణీ కేంద్రానికి



బోథ్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో బోథ్ నియోజకవర్గ కేంద్రంలో ఎన్నికల సామగ్రిని పంపిణీ చేశారు. సొనాల గ్రామానికి చెందిన ఓ మహిళా ఉద్యోగికి ఇటీవల కాలికి గాయమైంది. విధుల్లో భాగంగా ఆదివారం ఎన్నికల పంపిణీ కేంద్రానికి వచ్చింది. కాలి గాయంతో విధులు నిర్వహించలేని పరిస్థితి ఉండటంతో ఆమెను అధికారులు రిజర్వ్ చేశారు.

ఎన్నికల విధుల్లో తండ్రి, కూతురు



కుంటాల: సారంగాపూర్ మండలంలోని మలక్‌చించోలి గ్రామానికి చెందిన గుండ భూమేష్ జౌలిలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. ఆయన కుమార్తె ప్రగతి కుంటాల మండలం సూర్యాపూర్ ఏఈవోగా విధులు నిర్వర్తిస్తున్నారు. లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా విధులు నిర్వర్తించేందుకు ముధోల్ నియోజకవర్గానికి వచ్చినట్లు వారు ఆదివారం పేర్కొన్నారు.


దేవాపూర్‌లో మహిళా పోలింగ్ స్టేషన్ సిబ్బందికి స్వాగతం పలుకుతున్న అధికారులు


లంబాడితండాలో సిబ్బందికి స్వాగతం పలుకుతున్న అధికారులు, సభ్యులు

గ్రాండ్ వెల్‌కం

లోక్‌సభ ఎన్నికల నిర్వహణ కోసం ఎన్నికల సామగ్రితో పోలింగ్ కేంద్రాలకు ఆదివారం వచ్చిన సిబ్బందికి మంచిర్యాల జిల్లా కాసిపేట మండలంలో ఘన స్వాగతం లభించింది. మండలంలోని లంబాడితండా(కె) పోలింగ్‌స్టేషన్‌కు వచ్చిన సిబ్బందికి గ్రామస్తులు దప్పుచప్పుళ్లతో స్వాగతం పలికారు. పుష్పగుచ్ఛాలు అందించారు. లంబాడితండాలోని 30 పోలింగ్ కేంద్రాన్ని మోడల్ కేంద్రంగా ప్రకటించడంతో ఏర్పాట్లు కూడా ఘనంగా చేసిన ఎంపీవో నాగరాజు, డీఆర్డీవో కిషన్, మహిళా సంఘం సభ్యులతో సిబ్బందిని స్వాగతించారు. దేవాపూర్‌లో 13వ నంబర్ పోలింగ్ బూత్ మహిళా పోలింగ్ బూత్‌గా ఎంపిక చేయడంతో పంచాయతీ కార్యదర్శి కవిత ఆధ్వర్యంలో పోలింగ్ సిబ్బందికి బొట్టు పెట్టి, గుస్సాడీ నృత్యాలతో స్వాగతం పలికారు. పోలింగ్ కేంద్రాన్ని సుందరంగా తీర్చిదిద్ది ఏర్పాట్లు పూర్తిచేశారు. మహిళలు అధిక సంఖ్యలో ఓట్లు వేయాలని కోరారు. - కాసిపేట